క్లుప్తంగా

రేపటి నుంచి ఉంగుటూరులో మండల స్థాయి క్రీడా పోటీలు

ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్‌-14, 17 బాల, బాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్‌.అనిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న బాలురకు, 8న బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాల, బాలికలకు సంబంధించిన మండల లెవల్‌ ఎంట్రీ, మధ్యాహ్న భోజన ఫారం, ఆధార్‌ జిరాక్స్‌లను తప్పనిసారిగా పీడీలు అందజేయాలని సూచించారు. మండలంలోని జెడ్పీ హైస్కూల్స్‌, యూపీ స్కూల్స్‌, ప్రైవేట్‌ స్కూల్స్‌ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రేషన్‌ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



గన్నవరం: రేషన్‌ షాపు డీలర్ల సంక్షేమ సంఘం గన్నవరం మండల నూతన అధ్యక్షుడిగా కోట రాజు ఎన్నికయ్యారు. స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఆదివారం జరిగిన సంఘం మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్వీ సాయికృష్ణ, కార్యదర్శిగా టి.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా జి.శుభలక్ష్మి, సహాయ కార్యదర్శిగా ఎం.నాగలక్ష్మి, కోశాధికారిగా జి.రాధిక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కస్తూరి అప్పారావు మాట్లాడుతూ.. రేషన్‌ డీలర్లందరూ ఐక్యమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కలిసి పోరాడాలన్నారు. రేషన్‌ డీలర్లపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మండలంలోని 37 మంది రేషన్‌ డీలర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య సమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించారు. ప్రతి ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించడం జరుగుతుంది. సేవలో పాల్గొన్న భక్తులకు ఆరోగ్య సిద్ధితో పాటు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తొలగిపోతాయని అర్చకులు పేర్కొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్‌ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో ఆదివారం డ్రెయిన్ల పూడికతీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లో మురుగునీరు సరఫరాకు ఆటంకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లలో పూడిక తీయించామన్నారు. గ్రామంలోని హిందూ శ్మశానం వద్ద ఆగిన డ్రెయిన్‌ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ డ్రెయిన్‌ను ఇటీవల ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులు పరిశీలించారని చెప్పారు.

అధ్వానంగా ఈడుపుగల్లు డొంకరోడ్డు



దెబ్బతిన్న ఈడుపుగల్లు డొంక రోడ్డు



గోతులమయంగా ఉన్న రహదారి మార్గం

- గోతులమయంగా రహదారి
- ప్రమాదాలకు నెలవుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు
- భయం భయంగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

కంకిపాడు: రోడ్డంతా గోతులమయం.. అధ్వానం ...రాకపోకలు సజావుగా సాగక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి...అయినా పట్టించుకునే నాథులే లేకపోవటంతో ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రమాదకరంగా మారిన రోడ్డు మీదనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా ఈడుపుగల్లు వద్ద మసీదు వెనుక వైపున ఉన్న డొంక రోడ్డు మార్గాన్ని కొన్నేళ్ల క్రితం రియల్‌ వెంచర్‌ నిర్వాహకులు తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈడుపుగల్లు గ్రామంతో పాటు గంగూరులో నడుస్తున్న పలు విద్యాసంస్థలకు విద్యార్థులు వెళ్లేందుకు ఈ రోడ్డు మార్గాన్ని వినియోగిస్తుంటారు.

అడుగడుగునా గోతులు..

వాహనాల రద్దీ, భారీ లోడు వాహనాల రాకపోకలతో రోడ్డు ప్రస్తుతం గోతులమయంగా మారింది. అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ఓ వైపు పంట బోదె కూడా ఉండటంతో రోడ్డు మార్జిన్లు కుంగిపోయి కోతకు గురవుతున్నాయి. రోడ్డు కుంగి మధ్యలో ఎత్తుపల్లాలు ఏర్పడటం, అక్కడక్కడా ఏర్పడిన పెద్ద పెద్ద గోతుల కారణంగా ప్రజలు ఈ మార్గంలో ప్రయాణం అంటేనే హడలెత్తిపోతున్నారు. ఆదమరిస్తే ఎప్పుడెలాంటి ప్రమాదం చోటుచేసుకుంటుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

నిర్లక్ష్యంతో ఇబ్బందులు

స్థానిక సంస్థల అధికారులు, మండల పరిషత్‌ అధికారులు ఏ ఒక్కరూ ఈ రోడ్డు అధ్వాన పరిస్థితిని గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కనీసం గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. అధికారుల అలసత్వం, నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసమై పోతున్నా పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

కనులపండువగా దుర్గమ్మ ఊరేగింపు



అమ్మవారి ఊరేగింపు



అమ్మవారి ప్రభ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కనకదుర్గ అమ్మ వారి దేవి శరన్నవరాత్రుల ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాలాంధ్ర రోడ్డులో కనకదుర్గ అమ్మ వారి ప్రభ మహోత్సవం కనులపండువగా జరిగింది. గత నెల 22 వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు చలసాని చౌక్‌లో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లో కనకదుర్గమ్మను వివిధ అలంకారాల్లో పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి సన్నాయి వేశాలు, బేతాళ వేషాలు, మహిళల కోలాటంతో పాటుగా కోయ డ్యాన్స్‌తో భారీ ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు క్విజ్‌ పోటీలు



క్విజ్‌ పోటీలలో విజేతలతో గ్రంథాలయ అధికారి

మధురానగర్‌(విజయవాడసెంట్రల్‌): బందరు రోడ్డులోని ఠాగూర్‌ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ గురించి క్విజ్‌ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకులు చరిత్రలో తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి నెల చివరి ఆదివారం క్విజ్‌ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. క్విజ్‌ను మాస్టర్‌ దేవ్‌, దుర్గా భవాని నిర్వహించారు. వివిధ స్కూల్స్‌ నుంచి నాలుగో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులను ఆకట్టుకుంది. గాంధీజీ వేషధారణతో అలరించిన ఉమాను గ్రంథాలయ అధికారి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్విజ్‌ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేడు అన్నమయ్య గృహసాధన సమితి ర్యాలీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): తిరుమల కొండపై కూల్చేసిన ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులవారి గృహాన్ని అక్కడే యథాతథంగా యథాస్థానంలో పునర్నిర్మించాలని కోరుతూ శ్రీఅన్నమయ్య గృహసాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. పవిత్రమైన అన్నమయ్య మండపంలో ఆయన స్వహస్తాలతో పూజించిన హనుమంతుని విగ్రహంతోపాటు అన్నమయ్య విగ్రహాన్ని కూడా యథాస్థానంలో ఉన్నది ఉన్నట్లుగా పునఃప్రతిష్ఠించాలన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లపూడిలోని వెంకయ్య స్వామి ఆలయం నుంచి ఎండోమెంట్‌ ఆఫీస్‌ వరకు వివిధ పీఠాధిపతులు, స్వామీజీలు, కళాకారులతో ప్రదర్శనగా బయలుదేరి దేవదాయ శాఖ అధికారులకు వినతి పత్రం అందించనున్నట్లు అన్నమయ్య గృహసాధన సమితి సభ్యులు తెలిపారు

సమాజ సేవలో రోటరీ క్లబ్‌



గన్నవరంరూరల్‌: సమాజ సేవలో రోటరీ క్లబ్‌ ముందుంటుందని రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గన్నవరం అధ్యక్ష కార్యదర్శులు జీవీ రవిబాబు, కె.నాగరాజు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యచారిటీస్‌ వృద్ధాశ్రమ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్‌ సౌజన్యంతో బీటెక్‌ చదువుతున్న కందుల నాగ సాత్వికకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి భాగ్యలక్ష్మికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులకు పుణ్యచారిటీస్‌ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రోటరీ క్లబ్‌ సమాజ సేవతో పాటు పేద విద్యార్థులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రోటేరియన్లు నర్రా సీతారామారావు, కొల్లి సత్యజగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం



ఉయ్యూరు: మండలంలోని బోళ్లపాడు గ్రామంలో శతాధిక వృద్ధురాలు కొండా మంగమ్మను ఆదివారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించి, శతజయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి భీమవరపు కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ తుమ్మూరు గంగారత్నం, గ్రామ పెద్దలు సంజీవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బంధువులు, కుటుంబ సభ్యులు కలిసి మంగమ్మను సత్కరించి ఆశీర్వచనం తీసుకున్నారు. వందేళ్ల తీపి జ్ఞాపకాలు, అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



గంగూరులో గ్యార్మీ వేడుకలు చేస్తున్న ముస్లింలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్‌: హనుమాన్‌జంక్షన్‌లో 18వ గ్యార్మీ షరీఫ్‌ ఉత్సవాలను ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ప్రధాన రహదారుల్లో ప్రత్యేకంగా అలంకరించిన జెండాలను మేళతాళాలు, తీన్‌మార్‌ డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం స్థానిక తారకరామ కాలనీలోని జెండా చెట్టు వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేపట్టారు.

గంగూరులో గ్యార్మీ షరీఫ్‌ ఉత్సవం

పెనమలూరు: గంగూరు గ్రామంలో గ్యార్మీ షరీఫ్‌ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ఆజం చిహ్నమైన జెండాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామంలో మసీదు వద్ద నుంచి జెండా చెట్టు వరకు ఊరేగించారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. గ్రామంలో ప్రదర్శించిన జెండాలన్ని జెండా చెట్టు వద్ద ప్రతిష్ఠించారు. పాత మసీదు వద్ద 5 వేల మందికి అన్నసమారాధన చేశారు. మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న హాకర్స్‌, వెండర్స్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ తూర్పు నగర నగర అధ్యక్ష కార్యదర్శులు వి.బి.రాజు, ఎస్‌.కోటబాబు డిమాండ్‌ చేశారు. స్థానిక రాణిగారి తోటలోని గుంటూరు బాపనయ్య భవనంలో ఆదివారం విజయవాడ తూర్పు నగర హాకర్స్‌ అండ్‌ వెండర్స్‌ యూనియన్‌ జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఈ సందర్భంగా రాజు, కోటబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి చూపించక పోయినా చిరు వ్యాపారులు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. వీరి ఉపాధిని దెబ్బతీసి నోటి దగ్గర కూడును లాగేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అధికార పార్టీ నాయకులు ఉపాధి కల్పించకపోగా ఉన్న షాపులు, బండ్లను బలవంతంగా తొలగిస్తున్నారని చెప్పారు. ఫైన్లు వేసి కేసులు నమోదు చేయిస్తున్నారని తెలిపారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వాలు ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్న హాకర్లకు కనీసం బ్యాంకు లోన్లు కూడా ఇవ్వటంలేదన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవిత బీమా, ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం నూతన కన్వీనింగ్‌ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా టి.చంద్రశేఖర్‌, కో కన్వీనర్‌గా బి.శ్రీనివాసులు, 13 మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.కృష్ణ, టి.చంద్రశేఖర్‌, ఎస్‌.నాగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆలంబనగా నిలవాలి



నిత్యావసరాలు, దుస్తులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్‌ ప్రతినిధులు

కంకిపాడు: వృద్ధులకు ఆలంబనగా నిలవాలని వక్తలు సూచించారు. లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ విజయవాడ రూరల్‌ ఆధ్వర్యంలో క్లబ్‌ సెక్రటరీ రావి సురేష్‌ బాబు పర్యవేక్షణలో ఈడుపుగల్లు కోదండ రామాలయంలో సేవ చేస్తున్న ఇద్దరు వృద్ధులకు దుస్తులు, నిత్యావసరాలను ఆదివారం పంపిణీ చేశారు. అనంతరం విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి వెంబడి మొక్కలు నాటించారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా మాట్లాడుతూ వృద్ధులకు అవసరమైనచేయూత అందించాలని, వారికి అండగా నిలవాలని కోరారు. మొక్కల సంరక్షణ బాధ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పి.ఇందిర, నాయకులు పందిపాటి సుధాకర్‌, షేక్‌ షకార్‌, విజయ్‌కుమార్‌, క్లబ్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

వరి పంటకు తెల్లదోమ పోటు

- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు



కె.తాడేపల్లి గ్రామంలో తెల్ల దోమపోటుకు గురైన వరి పొలం

విజయవాడరూరల్‌: వరి పంట పొలాలకు తెల్ల దోమపోటు తగిలింది. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో వరి పంట పొలాలు ఉమ్మతీత అధికంగా ఉండటం, చిరుపొట్టదశలో ఉండటంతో వరి పంట పొలాల్లో తెల్ల దోమపోటు ఆశించి పసుపు, తెలుపు రంగుల్లో పంట పొలాలు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నున్న, పాతపాడు, విలేజి కండ్రిక, అంబాపురం, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లోని వరి పొలాలకు తెల్ల దోమ కనబడుతుంది. దీని ప్రభావంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు దిగులు పడుతున్నారు. వర్షాలు వరుసగా కురవడంతో పంట పొలాలకు పూర్తి స్థాయిలో ఎండ తగలడంలేదు. దీంతో ఆకు పీల్చే పురుగు ఆశించడంతో పచ్చగా ఉండాల్సిన పంట తెలుపు రంగులో మారిందని రైతులు అంటున్నారు. ఈ రెండు సమస్యలతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిపిటి- 5204, 1262 రకం వరిపొలాల్లో ఈ ప్రభావం అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. వరిదుబ్బు మొదళ్లలో ముదురు పచ్చ రంగులో ఉండాల్సింది తెలుపు రంగు లో కనిపిస్తోందంటున్నారు. 1318 రకం వరి పంటలో పసుపు రంగుగా తిరగమారుతుందని నున్న గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు.

దోమ పోటుకు చర్యలు చేపట్టాలి..

విజయవాడ రూరల్‌ మండలంలో ఈ ఖరీఫ్‌ సీజన్లో 9,600 ఎకరాల్లో వరిసాగు జరిగిందని వ్యవసాయాధికారి కె.రఘురామ్‌ తెలిపారు. తెల్ల దోమ, ఆకుపీల్చే పురుగు సమస్యలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను పురుగు ఆశించిన ప్రభావం కనిపించడం లేదన్నారు. ఆయా గ్రామాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఒక వేళ తెల్ల దోమ ఉధృతంగా ఉంటే లీటరు నీటికి ఆర్తీన్‌ మందు 150 నుంచి 200 గ్రాములు, వేప నూనె 300 పీపీఎం లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

అపూర్వ సమ్మేళనం



గెట్‌ టు గెదర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ 1983–84 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక గుడివాడ రోడ్డులోని శ్రీ శ్రీనివాసా రెసిడెన్సీలో గెట్‌ టుగెదర్‌ కార్యక్రమం నిర్వహించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ మురిసిపోయారు. అనంతరం అందరూ కలిసి ఆట పాటలతో సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు జెమీల్‌, త్రివిక్రమ సాయిరాం, హైదర్‌, సిద్దిక్‌ పాషా, కేవీవీ లక్ష్మీ, పద్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి భక్తులతో ఆదివారం కోలాహలంగా మారింది. మహిళా భక్తులు పాల పొంగళ్లను పొంగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు దేవస్థాన చైర్మన్‌ ఈడే వెంకట విష్ణుమోహన్‌ రావు తాగునీరు తదితర కనీస సౌకర్యాలను కల్పించారు.

భక్తజన కీలాద్రి

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ సన్నిధిలో భవానీల రద్దీ కొనసాగుతోంది. వేలాది మంది భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఆదివారం కావడంతో భవానీలతో పాటు సాధారణ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, విజయవాడ



దుర్గామాత మాల విరమణ చేస్తున్న గురు భవానీ



అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



క్యూ లైన్‌లో అస్వస్థతకు గురైన భక్తురాలికి సపర్యలు చేస్తున్న బంధువులు



ఇరుముడి సమర్పిస్తున్న భవానీలు



అమ్మ సన్నిధిలో భవానీలు



వెండి బోనం సమర్పించేందుకు వస్తున్న భవానీ